పత్రికాప్రకటన కాకినాడ, 28.6.2019

జిల్లాలో బెల్ట్ మద్యం షాపులు, నాటుసారా తయారీ, గంజాయి సాగు అంశాలను ఉక్కుపాదంతో సమూలంగా నిర్మూలించాలని జిల్లా కలెక్టర్ డి.మురళీధరరెడ్డి ఎక్సైజ్, పోలీస్ అధికారులను ఆదేశించారు.

శుక్రవారం ఉదయం జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి అధ్యక్షతన ఆయన ఛాంబరులో జిల్లా స్థాయి ఎక్సైజ్ విజిలెన్స్ కమిటీ సమావేశం జరిగింది. సమావేశంలో బెల్ట్ షాపులు, నాటుసారా, గంజాయి సాగు అంశాలపై సమీక్షించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల కనుగుణంగా రానున్న ఐదేళ్లలో దశలవారీగా మద్య నిషేదం అమలుకు జిల్లా కార్యాచరణను సూచించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రజలు ఏటా 1800 కోట్లు మద్యం కొనుగోలుకు వెచ్చిస్తుండగా, మరో 3000 కోట్లు మద్యసేవన వల్ల చెడిన ఆరోగ్యం బాగుచేయించుకునేందుకు వైద్యం కొరకు ఖర్చు చేస్తున్నారన్నారు. అలాగే మద్యం సేవించిన వ్యక్తులు పనులకు సక్రమంగా వెళ్లకపోవడం కోట్ల విలువైన పనిదినాలు నష్టపోయి,కుటుంబాలు ఛిద్రమై మరింత పేదరికంలోకి కూరుకు పోతున్నాయన్నారు. మద్యం మత్తులో వాహనాలను నడిపి ప్రమాదాల్లో తమ ప్రాణాలు కోల్పోవడంతో పాటు, రోడ్డుపై పోతున్న తోటి వారికి కూడా ప్రాణహాని కలిగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. మద్యం మైకంలో జరుగుతున్న హత్యలు, మానభంగాలు ప్రజలను అభద్రతకు, అశాంతికి గురిచేస్తున్నాయన్నారు. సమాజానికి ఇంతటి చేటు కలిగిస్తున్న మద్యపానాన్ని రాష్ట్రంలో రూపు మాపేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో మద్యనిషేదాన్ని నవరత్న ప్రాధాన్యలతలో ఒకటిగా చేర్చిందని తెలిపారు. మద్యం ఒక ఆదాయవనరనే గత కాలపు సంకుచిత విధానాలకు చరమ గీతం పాడి, దశల వారీగా రానున్న ఐదేళ్ల కాలంలో రాష్ట్రంలో సంపూర్ణ మద్య నిషేదం అమలులోకి తేనుందన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని జిల్లాలో పటిష్టంగా అమలు చేసేందుకు ఎక్సైజ్, పోలీస్ శాఖలు సమాయత్తం కావాలని, మద్యం దుష్ప్రభావాలపై అవగాహన కల్పించి ఆచరణాత్మకమైన ప్రజా సహకారాన్ని సాధించేందుకు మిగిలిన ప్రభుత్వ శాఖలన్ని సేవలను సమన్వయపరుస్తామన్నారు. పార్కులు, బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించి వీరంగంతో ప్రజలను భయబ్రాంతులకు గురుచేస్తున్న వారిని పట్టుకుని శిక్షించడ వల్ల మార్పు రావటం లేదని, అటువంటి వారిని పట్టన, గ్రామ ప్రధాన కూడళ్లల్లో "తప్పు చేశాం, సిగ్గుపడుతున్నాం, మరెప్పుడూ చేయం, క్షమించండి " అని వ్రాసిన ప్లకార్డులతో నిలబెట్టాలని ఆదేశించారు. మందుబాబుల పబ్లిక్ న్యూసెన్స్, బెల్ట్ విక్రయాలు, కాపుసారా వంటి అంశాలను ప్రజలెవరైనా గమనిస్తే వెంటనే సమాచారం అందించేందుకు మొబైల్ వాట్సాప్ నెంబరు, కంట్రోల్ రూమ్ నెంబరు ఏర్పాటు చేయాలని, సమాచారం అందించే వారికి గోప్యత కల్పించాలని సూచించారు. మద్యానికి బానిసైన వారి కోసం ప్రభుత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో జిల్లా వ్యాప్తంగా డిఅడిక్షన్ సెంటర్లను ఏర్పాటు చేయాలని కోరారు. బెల్ట్ షాపులు, నాటు సారా బట్టీలపై ఉక్కు పిడికిలి బిగించాలని, కనికరం లేకుండా కఠినంగా వ్యవహరించాలని పోలీస్, ఎక్సైజ్ శాఖలకు స్పష్టమైన సూటి ఆదేశాలు కలెక్టర్ జారీ చేశారు. జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతంలో అక్కడక్కడా జరుగుతున్న గంజాయి సాగుపై డేగ కన్ను వేయాలని, ఎక్కడైనా గుర్తిస్తే ధ్వంసం చేయాలని ఆదేశించారు. మద్యపానం, మాదకద్రవ్యాల పరిణామాలపై పాఠశాల విద్యార్థులకు వివరించి, వారి ద్వారా పెద్దలలో మార్పు తెచ్చే కార్యక్రమాలను నిర్వహించాలని విద్యాశాఖకు, డ్వాక్రా సంఘాలు, యువజన సంఘాల సమావేశాలలో ఈ అంశాల చర్చ జరిగేట్లు చూడాలని డిఆర్డిఏ, మెప్మా విభాగాలకు సూచించారు. మద్యపాన నిషేదానికి రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన దృఢ సంకల్పానికి ఉద్యమ బావుటాలా తూర్పు గోదావరి జిల్లాను ముందు నిలపాలని జిల్లా కలెక్టర్ మురళీధరరెడ్డి అధికారులకు, ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఎక్సైజ్ డిప్యూటీ కమీషనర్ వి.అరుణ్ రావు జిల్లాలో ప్రస్తుతం లైసెన్స్ పొందిన 534 వైన్ షాపులు, 45 బార్ అండ్ రెస్టారెంట్లు నిర్వహణలో ఉన్నాయని తెలియజేశారు. మండల అడాప్షన్ అధికారులను నియమించి బెల్ట్ షాపుల నిర్మూలనకు చర్యలు చేపట్టామని తెలియజేశారు. అలాగే జిల్లాలోని రాజమండ్రి, రాజానగరం, పెద్దాపురం, ప్రత్తిపాడు, తుని మండలాల్లో జరుగుతున్న నాటు సారా తయారీని నిర్మూలనకు నిరంతరం దాడులు జరుపుతూ సుమారు వెయ్యి మందిని బైడోవర్ చేశామని, 5 గురి పై పిడి యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేశామని తెలిపారు. బెల్ట్ షాపులు, నాటుసారాబట్టీలు, గంజాయిసాగు, పబ్లిక్ నూసెన్స్ అంశాలపై ప్రజలు ఫిర్యాధు చేసేందుకు తమ కార్యాలయంలో 0884-2376227తో కంట్రోల్ రూమ్, టోల్ ఫ్రీ నెంబరు 1800-425-4868 ఏర్పాటు చేశామని తెలియజేశారు. అలాగే అటువంటి వాటి ఫోటోలు, వీడియోలను ప్రజలు పంపేందుకు వాట్సాప్ నెంబరు 9440902258 ఏర్పాటు చేశామని తెలిపారు. సమాచారం అందించే వారి వివరాలను అత్యంత గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

ఈ సమావేశంలో అడిషనల్ ఎస్ పిలు ఎస్ వి శ్రీధరరావు, కె.లతామాధురి, ఎక్సైజ్ అసిస్టెంట్ కమీషనర్ జయరాజు, సూపరింటెడెంట్లు ప్రభుకుమార్, ఏసుదాసు, రామచంద్రరావు పాల్గొన్నారు.

(సమాచార శాఖచే జారీ)